**కథ**

# ప్రేమ ప్రయోగం

**'అనూరాధ'**

**"వావ్! చందూ మీ ఊరు చాలా బావుంది. చుట్టూ గ్రీన్ హిల్స్. బే ఆఫ్ బెంగాల్, నైస్ సిటీ" మళ్లీ మెచ్చుకుంది రశ్మి.**

"థాంక్యూ! ఈరోజే వచ్చావుగా. రేపట్నుంచీ సైట్ సీయింగ్‌కి వెళ్దాం ఇంకా నచ్చుతుంది మా వైజాగ్" అంది చందన. ఆ రోజే రశ్మి మొదటిసారిగా హైదరాబాద్ నుంచి వైజాగ్ వచ్చింది. ఏడాది క్రితమే ఆమె పెద్దమ్మావాళ్లు వైజాగ్ ట్రాన్స్‌ఫర్ అయి వచ్చారు. బి.టెక్. ఎగ్జామ్స్ రాసి వాళ్లని చూడడానికి వచ్చింది రశ్మి.

రశ్మి ఆమె కజిన్ చందన ఇద్దరూ వాళ్లింటి డాబా ఎక్కి తిరుగుతున్నారు. ప్రశాంతంగా ఉన్న ఆ ఊరూ, అలాగే పచ్చని చెట్లతో కామ్‌గా, పోష్‌గా ఉన్న ఆ కాలనీ రశ్మికి బాగా నచ్చాయి.

బాగా అల్లరి పిల్ల అయిన రశ్మి సరదాగా డాబా గోడెక్కి కూర్చుంది.

"రశ్మీ జాగ్రత్త! అమ్మ చూస్తే భయపడుతుంది" అంది చందన.

"పెద్దమ్మ చూస్తే దిగిపోతాన్లే" అంటూ చందనతో కబుర్లు చెప్తోంది రశ్మి.

సడన్‌గా బైక్ చప్పుడు వినిపించి ఎదురింటి వైపు చూసింది.

"ఎవరే చందూ ఆ హాండ్‌సమ్?" ఎదురింటి గేట్లోంచి అప్పుడే బైక్ ఎక్కి వెళ్తున్న ఒక పాతికేళ్ల యువకుణ్ని చూస్తూ అడిగింది రశ్మి.

"చూశావా? ప్చ్ శుద్ధ వేస్ట్ ఫెలో" చందన పెదవి విరిచింది.

"ఏం పాపం?" అంది నవ్వుతూ.

"మహా బుద్ధిమంతుడు. అమ్మాయిలని కన్నెత్తయినా చూడడు. ఇంట్లో వంచిన తల మళ్లీ ఆఫీసులోనే ఎత్తుతాట్ట వాళ్లమ్మ ఎప్పుడూ చెప్తుంటుంది" అంది చందన.

"కొయ్ కొయ్" రశ్మికి నవ్వాగలేదు.

"ఇట్స్ ట్రూ రశ్మీ! మేమిక్కడికొచ్చిన ఈ వన్ ఇయర్ నుంచీ చూస్తున్నాను కదా అతను స్టీల్‌ప్లాంట్‌లో ఇంజనీరు. అతనికక్కడ క్వార్టర్ ఇస్తారట. కానీ వాళ్లమ్మ అక్కడ కొడుకు వంటరిగా ఉండలేడని బెంగ పెట్టుకుందట. అందుకే ఇక్కణ్నుంచే రోజూ అంత దూరం అప్ అండ్ డౌన్ చేస్తాడు. అమ్మాయిలతో అస్సలు మాట్లాడడు. చాలా బుద్ధిమంతుడు" రాజా గురించి చెప్తోంది చందన.

"ఆహా! అంత సీనుందా? అయితే ఓసారి చెక్ చేద్దాం. అబ్బాయిగారు ఎంత బుద్ధిమంతుడో?" రశ్మిలోని అల్లరి పిల్ల బయటకి వచ్చేసింది.

"ఏం చేస్తావే?" చందన క్యూరియస్‌గా అడిగింది. ఇద్దరూ సేమ్ ఏజ్ కావడంతో వాళ్లిద్దరూ మంచి ఫ్రెండ్స్ కూడా.

"చెప్తా చెప్తా! వాళ్లింటి ఫోన్ నెంబర్ కావాలి" అంది రశ్మి.

"ఏమో! ఎదురిల్లే కానీ నాకు నెంబర్ తెలీదు" అంది చందన.

"అయితే పద డైరెక్టరీ చూద్దాం" రశ్మికి చేతి నిండా పని దొరికింది.

* * *

ఆ సాయంత్రం ఆరుగంటలకి రాజా ఇంటికి రాగానే రశ్మి, చందన ఇద్దరూ రశ్మి సెల్‌ఫోన్ పుచ్చుకుని డాబా ఎక్కేశారు. రశ్మి నవ్వుకుంటూ రాజా ఇంటికి కాల్ చేసింది.

రాజా వాళ్ల మదర్ ఫోనెత్తింది.

"హలో ఆంటీ" తియ్యగా పిలిచింది రశ్మి.

"ఎవరమ్మా?" అడిగిందావిడ.

"నేను రాజా ఫ్రెండ్‌నాంటీ. తనకోసారి ఫోనిస్తారా?" అడిగింది.

"ఫ్రెండా? నీ పేరేంటమ్మా?"

"ఆంటీ! అర్జెంట్ ప్లీజ్ రాజాని పిలవండి" రిక్వెస్టింగ్‌గా అడిగింది తన పేరు చెప్పకుండా.

"ఎవరమ్మా?" పక్క నుంచి రాజా అడుగుతున్నాడు.

"నీకేరా! ఎవరో అమ్మాయి" అంటూ ఆవిడ రాజాకి ఫోనిచ్చింది.

"హలో" రశ్మికి రాజా వాయిస్ మొదటిసారి స్పష్టంగా వినిపించింది.

'వాయిస్ ఎక్స్‌లెంట్. చూద్దాం అబ్బాయిగారి సంగతి' మనసులో అనుకుని.. "హాయ్ రాజా" అంది.

"హు ఈజ్ స్పీకింగ్?" అడిగాడు రాజా.

"ఏయ్ నన్నే గుర్తుపట్టలేదా? ఎవరో చెప్పుకో?" అల్లరిగా అడిగింది.

"వన్ మినిట్" రాజా ఫోన్ వాళ్లమ్మకి దూరంగా పట్టికెళ్లినట్టున్నాడు.

"అనితా?" అడిగాడు మెల్లగా.

"ఉహూ కాదు"

"గీతిక?" సందేహంగా అడిగాడు.

చందనకేసి చూసి నవ్వి- "ఊహూ కానే కాదు" అంది.

"అయితే మనీష కదూ"

"ఏయ్! ఇంత మంది అమ్మాయిల పేర్లు చెప్తున్నావు? అయితే నన్ను మర్చిపోయావన్నమాట" అలకగా అంది.

"సారీ సారీ! ప్లీజ్ నీ నేమ్‌లో ఫస్ట్ లెటర్ అయినా చెప్పు. చెప్పేస్తాను. బతిమలాడాడు రాజా.

"ఎందుకు చెప్పాలి? నువ్వు నన్ను పూర్తిగా మర్చిపోయావు. చాలా మంది గర్ల్‌ఫ్రెండ్స్ దొరికారుగా" నిష్టూరంగా అని చందనకేసి చూసింది.

వాళ్లిద్దరికీ రాజాని పట్టుకున్నందుకు చాలా సరదాగా ఉంది.

"ఓకే! నువ్వు కాలేజ్‌లో ఫ్రెండ్‌వా? లేక ఆఫీసులోనా అది చెప్పు నీ పేరు చెప్పేస్తాను" అన్నాడు రాజా.

"అక్ఖర్లేదు. నువ్వు నన్ను మర్చిపోయాక ఇక కాలేజయినా, స్కూలయినా, ఆఫీసయినా వేస్టే" కోపంగా అంది.

"స్కూల్? అయితే నువ్వు రాణివి కదూ. యామై కరెక్ట్" ఉత్సాహంగా అన్నాడు రాజా.

"ఓహో! ఈ రాజాకి ఓ రాణీ కూడా ఉందా? అదీ స్కూల్ డేస్‌లోనే. ఉండు ఈ విషయం మీ మదర్‌తో చెప్తాను" బెదిరింపుగా అంది.

"మా మదర్ నీకెలా తెలుసు?" వెంటనే అడిగాడు.

"తెలీదు. కానీ మీ ఇంటికొచ్చినప్పుడు చెప్తాను" చిన్నగా నవ్వాడు.

"మా ఇంటికి వద్దులే కానీ బీచ్‌కొస్తావా?" అడిగాడు రాజా.

"నా పేరే గుర్తు లేదు. అయినా నీకింతమంది గర్ల్‌ఫ్రెండ్స్ున్నారని తెలిశాక నేనెందుకొస్తాను బీచ్‌కి? బై" ఫోన్ ఆఫ్ చేసేసింది. అంటే అబ్బాయిగారు ఇంట్లో రాముడు వీధిలో కృష్ణుడు. ఇద్దరూ నవ్వుకుంటూ డాబా దిగారు.

* * *

నెక్స్ట్ డే మార్నింగ్ రశ్మి ఇంకా నిద్ర లేవలేదు. ఆమె మొబైల్ రింగయింది.

ఆ నిద్రమత్తులోనే తీసి "హలో" అంది.

"నువ్వెవరో నాకు తెలిసిపోయింది" రాజా వాయిస్ వినిపించి తుళ్లిపడింది.

అసలు రాజాకీ నెంబర్ ఎలా తెలిసింది. ఆమెకంతా కన్ఫ్యూజింగ్‌గా ఉంది.

"నువ్వు నీలూవి కదూ?" ఉత్సాహంగా అంటున్న



రాజా గొంతు విని ఒక్కసారి ఊపిరి వదిలింది.

"అవును ఎలా గుర్తుపట్టావు?" అలా అయితే ఇక తన మీద అనుమానం రాదని వెంటనే ఒప్పేసుకుంది.

"నీ స్వీట్ వాయిస్ విని రాత్రంతా నువ్వేనేమో అనిపించింది. చాలా రోజులయింది కదా మనం కలసి. అందుకే వెంటనే గుర్తుపట్టలేకపోయాను. సారీ నీలూ" అన్నాడు రాజా.

"నా నెంబర్ నీకెలా తెలిసింది?" అనుమానం ఇంకా పూర్తిగా తీరక అడిగింది.

"ఎందుకు తెలీదూ? మా లాండ్‌లైన్‌కి కాలర్ ఐడి ఉంది".

ఛ! ఆ సంగతి ఆలోచించనే లేదు. తనని తానే తిట్టుకుంది.

"ఏం? ఈ రోజు ప్లాంట్‌కి వెళ్లక్కర్లేదా? పొద్దున్నే ఫోన్ చేశావ్?" అంది.

"నీలూ! నేనెక్కడ వర్క్ చేస్తున్నానో కూడా నీకు తెలుసా? మనం కలిసి త్రీ ఇయర్స్ అయిపోయింది కదా?" ఆశ్చర్యంగా అడిగాడు రాజా.

అతని మాటలు విన్నాక రశ్మికి చాలా ధైర్యం వచ్చేసింది.

"అవును. కానీ నాకు నీ సంగతి మొత్తం తెలుసులే" అల్లరిగా అంది.

"ఏ సంగతి?"

"నువ్వు ఇంట్లో రాముడివి వీధిలో కృష్ణుడివనీ" నవ్వింది.

"నాకిలాంటి టైటిలొకటి ఉందా? నాకు తెలియదే" రాజా నవ్వుతున్నాడు.

"ఇంకా ఉన్నాయి చెప్పనా?" టీజింగ్‌గా అడిగింది.

"చెప్పు"

"అమ్మకూచి...ఇంకా బుద్ధిమంతుడు"

"ఏయ్! స్టాప్ స్టాప్. ఇవన్నీ నీకెలా తెలుసు? అంటే నువ్విప్పుడు మా ఊళ్లోనే ఉన్నావా?" అడిగాడు.

"ఏ ఊళ్లో ఉన్నా ఒకటేలే" నిట్టూర్చింది.

"నీలూ చెప్పు. నువ్వెక్కడున్నావు? ఐ వాంట్ టు మీట్ యూ" బతిమలాడాడు.

"అబ్బా ఆశ! అయినా మీటయ్యి ఏం చేస్తావు? అట్ లీస్ట్ అమ్మాయిల్ని కన్నెత్తి కూడా చూడనంత బుద్ధిమంతుడివి కదా" నవ్వాపుకుంటూ అంది.

"ఏయ్ నన్ను టీజ్ చేస్తున్నావు కదూ. కానీ మా అమ్మ కోసం అలా ఉంటానంతే" అన్నాడు రాజా.

"అందుకే కదా నిన్ను అమ్మకూచి అనడం" ఇంకా నవ్వొచ్చింది రశ్మికి.

"నీలూ! మా అమ్మకి బాగా చాదస్తం. లవ్ మారేజెస్ అంటే అస్సలు గిట్టదు. నేనే అమ్మాయినైనా చూశాననుకో. ఆ అమ్మాయితో నేనెక్కడ లవ్‌లో పడిపోతానేమో అని భయపడి వెంటనే ఆ అమ్మాయిని నా చిన్నప్పుడెప్పుడో పోయిన నా సిస్టర్‌లా ఉందంటుంది. ఆ అమ్మాయి దగ్గరకెళ్ళి అలాగే చెప్పి, వీలైతే ఆ అమ్మాయి చేత నన్ను అన్నయ్యా అని పిలిపిస్తుంది కూడా. ఆ పిలుపు వినాలంటే నా హార్ట్ బ్రేకయినట్లుంటుంది. అందుకే మా అమ్మ దరిదాపుల్లో ఉంటే రాముణ్నే" నవ్వుతూ చెప్పాడు.

"ఓహో! అదా సంగతి" రశ్మికి నవ్వొచ్చింది.

"అయితే నువ్వు మీ కాలనీలో ఉన్న అమ్మాయిల్ని అస్సలు చూడవా?"

"ఎందుకు చూడను చక్కగా చూస్తాను" నవ్వాడు.

"ఎలా చూస్తావు? నువ్వు వంచిన తల ఎత్తవుగా?"

"తలెందుకు ఎత్తడం? నేను పెట్టుకునే కూలింగ్ గ్లాసెస్‌లోంచి నేనెవర్ని చూసినా వాళ్ళకి తెలీదు. మా అమ్మకంతకన్నా తెలీదు. అలాగే నా రూంకి ఉన్న విండోగ్లాసెస్ కూడా అంతే. వాటిల్లోంచి మా కాలనీ అమ్మాయిలందరూ చక్కగా కనిపిస్తారు. ఇదుగో ఇప్పుడు కూడా మా ఎదురింట్లోకి కొత్తగా వచ్చిన బ్యూటీ కనిపిస్తోంది" రాజా చెప్తుంటే ఉలిక్కిపడింది రశ్మి.

"ఎలా కనిపిస్తోంది?" మెల్లగా అడిగింది.

"ఎలా ఏంటి? వాళ్ల బెడ్‌రూం విండోలోంచి. ఇప్పుడే లేచి ఎవరితోనో ఫోన్లో మాట్లాడుతోంది. క్యూట్ గర్ల్" అంటున్నాడు.

"ఏయ్ తప్పు కదూ అలా అమ్మాయిల్ని చూడ్డం?" కాస్త కోపంగా అంది.

"ఆ అమ్మాయేం తక్కువది కాదులే. చాలా అల్లరి పిల్ల చూడచ్చు ఏం కాదు" నవ్వాడు.

"అల్లరి పిల్లా! నీకెలా తెలుసు?" మళ్లీ కాస్త భయపడింది రశ్మి.

"నిన్న వచ్చీ రాగానే వాళ్లింటి డాబా గోడెక్కి మరీ కూర్చుంది. నేను వెళ్తుంటే నన్నే చూసింది" గొప్పగా చెప్పుకుంటున్నాడు.

'అమ్మో! వీడు చాలా పెద్ద ముదురే. జాగ్రత్తగా ఉండాలి. బాబోయ్! అనవసరంగా వీణ్ని కదిపానా దొరికిపోను కదా!' ఆలోచిస్తోంది.

* * *

"చందూ, రశ్మీ జాగ్రత్త. తొందరగా వచ్చేయండి" అంది ఇందిర.

"డోంట్ వర్రీ పెద్దమ్మా తొందరగానే వచ్చేస్తాం" అంటూ రశ్మి, చందన స్కూటీ మీద బయల్దేరారు.

రశ్మి టైట్ జీన్స్, అంతకన్నా టైట్ టీ షర్ట్ వేసుకుని సిల్క్ లాంటి హెయిర్ ఓపెన్‌గా వదిలి అది గాలికి ఎగురుతుంటే చందనతో కబుర్లు చెప్తూ నవ్వుకుంటూ వెళ్తోంది.

రశ్మి మొబైల్ రింగయింది. రాజా.

"హలో నీలూ" అన్నాడు.

"హాయ్" అంది.

"ఏంటీ? బయటకెళ్లావా?" అడిగాడు.

"అవును నువ్వింటికొచ్చేశావా?"

"ఇప్పుడే వచ్చాను. కానీ పూర్తిగా వేస్ట్" అన్నాడు.

"ఏమయింది?" కాస్త ఆశ్చర్యంగా అడిగింది.

"మా ఎదురింటి బ్యూటీని చూడాలని తొందరగా వచ్చేశాను. కానీ తను లేదు. బయటకెళ్లినట్లుంది. బోర్‌కొట్టి నీకు కాల్ చేశాను" అన్నాడు.

"ఓహో! అయితే ఆ అమ్మాయి బయటకెళ్లిందని నాకు కాల్ చేశావా?" చిరుకోపంగా అంది.

"సారీ సారీ! నువ్వు నా క్లోజ్ ఫ్రెండ్‌వి కదా అందుకే ఫ్రాంక్‌గా చెప్పేశాను. ఇప్పుడేం చెయ్యాలి పరమ బోర్‌గా ఉంది" అంటూ ఉన్నట్లుండి రాజా..."నీలూ! నువ్విప్పుడు బీచ్‌రోడ్‌లో ఉన్నావు కదూ" అడిగాడు. రశ్మి గొంతు పొడారిపోయింది. కొంపదీసి తనెవరో తెలిసిపోయిందా? కంగారుగా చుట్టూ చూసింది.

"నువ్వక్కడున్నట్లు నాకెలా తెలిసిందో అడగవేం?" అంటున్నాడు రాజా.

"చెప్పు?" కాస్త కంగారుగా అడిగింది.

"ఇప్పుడే నీ పక్కన ఎవరో సబ్‌మెరైన్ మ్యూజియం టిక్కెట్స్ కొంటున్నారు. అది నాకు వినిపించింది. నువ్వక్కడే ఉండు నేనొస్తున్నాను" అన్నాడు ఉత్సాహంగా.

ఠక్కున ఫోన్ ఆఫ్ చేసేసింది.

"పదవే బాబూ వీడు చాలా ఫాస్ట్. అనవసరంగా వీణ్ని కదిపాను" అంది చందనతో.

ఇద్దరూ కంగారుగా స్కూటీ స్టార్ట్ చేసుకుని బయల్దేరారు. వాళ్లు కాలనీలోకి ఎంటరవుతుండగా, రాజా ట్రిమ్‌గా తయారై బైక్‌మీద ఎదురొచ్చాడు. బీచ్‌కి వెళ్తున్నాడని తెలిసింది. రశ్మికీ, చందనకీ కళ్లల్లోంచి నవ్వు దూసుకొచ్చేసింది. ఇద్దరూ ఇంటికెళ్లి నవ్వుకుంటూ కూర్చున్నారు. ఇంకో గంట దాకా రాజా ఇంటికి రాలేదు.

రశ్మికీ, చందనకీ మంచి టైంపాస్ దొరికింది.

* * *

మర్నాడు ఉదయమే రాజా నుంచి ఫోన్ కాల్ వచ్చేసింది.

"నీలూ వాటీజ్ దిస్? నిన్న నీ సెల్‌ఫోన్ ఎందుకు ఆఫ్ చేసేశావు? నీ కోసం వస్తున్నానని చెప్పినా ఉండకుండా ఎందుకెళ్లిపోయావు? నేను నీ కోసం చాలాసేపు వెతికాను" రాజాకి కొంచెం కోపం వచ్చింది.

"నా కోసం ఎందుకు వెతకడం? అయినా నీకు ఇంకా చాలా మంది ఫ్రెండ్సున్నారుగా అనిత, గీతిక ఇంకా.."

"అవును. కానీ వాళ్లంతా జస్ట్ ఫ్రెండ్స్ అంతే" అన్నాడతను.

"మరి నేనూ అంతేగా"

"కాదు. నువ్వు స్పెషల్. అందుకే నీ కోసం హడావిడిగా వచ్చాను. కానీ నువ్వే ఉండకుండా వెళ్లిపోయావు"

"స్పెషలంటే నాకర్థం కాలేదు"

"స్పెషల్ కాకపోతే ఇన్నాళ్ల తర్వాత నువ్వు నాకు పనిగట్టుకుని ఫోనెందుకు చేశావు? నన్నెందుకు కవ్విస్తున్నావు? రియల్లీ నీలూ నీ వాయిస్ నన్ను చాలా డిస్టర్బ్ చేస్తోంది. ఇవాళైనా కరుణిస్తావా?" మెల్లగా అంటున్న రాజా వాయిస్ విని రశ్మి గుండె ఎందుకో ఝల్లుమంది. కాస్త తడబడి...

"అయినా నువ్వు అమ్మకూచివి కదా నేను కనిపించినా నువ్వేం చేస్తావు?" కవ్వించింది.

"ఏం చేస్తానా? నిన్నెత్తుకొచ్చేస్తాను"

"ఆహా! అంత ధైర్యం ఉందా?"

"అమ్మాయే సన్నగా అరనవ్వే నవ్వగా మతితప్పి కుర్రాళ్లే మత్తెక్కిపోయారే" రాజా అవతల నుంచి అల్లరిగా పాడాడు.

"అమ్మో! ఏమో అనుకున్నాను నువ్వు పెద్ద రౌడీవి" అంది.

"అది నీకిప్పుడు తెలిసిందా? అప్పుడు నన్ను చూస్తేనే పారిపోయేదానివి మరి?" అడిగాడు రాజా.

ఏం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయింది రశ్మి.


"హల్లో నీలూ! నువ్వెక్కడున్నావో చెప్పు. మీ ఇంటికొస్తాను" అన్నాడు రాజా.

"ఊహూ నేనే మీ ఇంటికొస్తాను" అంది.

"అప్పుడేనా? నువ్వు మా ఇంటికి రావాలంటే నీకు నేను కొంచెం ట్రైనింగ్ ఇవ్వాలి" నవ్వాడు రాజా.

"ట్రైనింగ్? ఫర్ వాట్?" ఆశ్చర్యంగా అడిగింది.

"మా అమ్మ సంగతి తెలిసిందే కదా ట్రెడి



షనల్. తులసికోట చుట్టూ ప్రదక్షిణాలు చేసే మహాలక్ష్మి లాంటి అమ్మాయి కోసం బైనాక్యులర్స్ పెట్టుకుని మరీ వెతుకుతోంది" చిన్నగా నవ్వాడు రాజా.

"మరి నువ్వు?" అడిగింది రశ్మి.

"నాకు నీలాంటి ముద్దొచ్చే అమ్మాయిలు ఎలా ఉన్నా ఇష్టమే"

"ఆహా! అయితే నీ ప్లాన్ నాకు బాగానే అర్థమైందిలే. నీకు నచ్చే అమ్మాయిని మీ అమ్మగారికి ట్రెడిషనల్‌గా చూపించి పెళ్లి చేసుకుంటావు యామై కరెక్ట్"

"గాటిట్! నాకు తెలుసు నువ్వు చాలా ఇంటెలిజెంట్‌వి. అందుకే నువ్వంటే నాకిష్టం"

"అలాగయితే మరి నిన్న ఆ ఎదురింటమ్మాయినెందుకు చూశావు?" వెంటనే అడిగింది.

"మరి నువ్వు నాకు కనిపించకుండా కవ్విస్తే నేనేం చెయ్యాలి? అందులోనూ ఆ అమ్మాయి జీన్స్‌లో అదిరిపోతుందనుకో. చూడకుండా ఉండడం కష్టమే" అంటున్నాడు రాజా.

రశ్మి లోలోపల నవ్వుకుంటూ ఫోన్ ఆఫ్ చేసేసింది.

★ ★ ★

"రశ్మి మనం తప్పు చేస్తున్నామే. పాపం రాజాని బాగా మిస్‌గైడ్ చేస్తున్నాం. అతను నిజంగా ఆ నీలూ అనుకుని రోజురోజుకీ అడ్వాన్స్ అయిపోతున్నాడు. తర్వాత హర్ట్ అవుతాడేమో?" చందన కాస్త భయంగా అంది.

"అవును చందూ! కానీ రాజాకెలా నిజం చెప్పాలో నాకూ తెలయటం లేదు"

ఆ రాత్రి పడుకున్నా నిద్ర పట్టటం లేదు రశ్మికి. ఈ నాలుగు రోజుల్లో రాజా నీలూ అనుకుని రశ్మితో చాలా క్లోజ్‌గా మాట్లాడుతున్నాడు. రశ్మి కూడా నిజం ఎలా చెప్పాలో తెలియక గిల్టీగా ఫీలవుతోంది.

"రశ్మీ! రేపు ఈవెనింగ్ నీ జర్నీ కదా. అట్‌లీస్ట్ రేపయినా రాజాకి చెప్పేయవే" అంది చందన.

"అవును చందూ రేపు రాజాకి చెప్పేస్తాను. అదర్‌వైజ్ ఐ ఫీల్ గిల్టీ ఆన్ మై సెల్ఫ్" అని చెప్పి పడుకుంది.

మర్నాడు ఉదయం పెద్దమ్మ తన కోసం కొన్న కొత్త శారీ కట్టుకుని గుడికి వెళ్లడానికి తయారై రాజా బయల్దేరే టైంకి గేటు దగ్గరకెళ్లి నిలబడింది.

ఆమెకి మనసంతా కలవరంగా ఉంది. రాజాని ఎలా పలకరించి అతనికి సారీ చెప్పాలి? అనుకుంటూ రాజా కోసం ఎదురుచూస్తోంది.

రాజాతో పాటు వాళ్లమ్మ కూడా బయటకొచ్చింది. ఆవిడకి బై చెప్పి రాజా బైక్ స్టార్ట్ చేసుకుని వెళ్లిపోతుంటే రశ్మికి మనసులో దిగులుగా ఉంది. అతన్నింక కలవడం కుదరదని ఏదో బాధగా ఉంది. ఈవెనింగ్ ఫోర్‌కే తన ట్రైన్.

గుడికెళ్లి మనస్ఫూర్తిగా దేవుడికి సారీ చెప్పేసింది.

"రశ్మీ! ఇంకెప్పుడు చెప్తావే?" అంది చందన.

"నేను హైదరాబాద్ వెళ్లాక చెప్పేస్తాను. అతని ఫేస్ టు ఫేస్ నిజం చెప్పలేననిపిస్తోంది" అంది రశ్మి ఏదో ఆలోచిస్తూ.

★ ★ ★

దూరమైపోతున్న వైజాగ్‌ని ట్రైన్లోంచి బెంగగా చూసింది రశ్మి. ఈ నాలుగు రోజులూ తను చేసిన అల్లరి, రాజాని కవ్వించడం అన్నీ గుర్తొస్తున్నాయి.

మొబైల్ రింగయింది. రాజా!

సంశయంగా కాస్సేపు చూసి ఫోనెత్తింది.

"హలో నీలూ" ఆ పిలుపు చెవికి రెండో పక్క వినపడి ఉలిక్కిపడి చూసింది.

రాజా అప్పుడే బాగ్ తీసుకుని ఫోన్లో మాట్లాడుతూ తన ఎదురుసీట్లో వచ్చి కూర్చున్నాడు.

రశ్మి గుండె ఒక్కసారి ఆగినట్లయింది. బయట దువ్వాడ స్టేషన్. స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ అంతా అక్కడే ట్రైనెక్కుతుంటారు. రాజా కాజువల్‌గా రశ్మి ఎదురు సీట్లో కూర్చుని-

"నీలూ! అర్జెంట్‌గా ఆఫీస్ వర్క్ మీద హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చింది. ఇప్పుడే ట్రైనెక్కాను" ఫోన్లో చెప్తున్నాడు.

ఓహో! అదా సంగతి. ఆగిన గుండె మళ్లీ కొట్టుకుంటోంది.

"ఓకె! సిగ్నల్ వీక్‌గా ఉన్నట్టుంది మళ్లీ చేస్తాను" రాజా ఫోన్ ఆఫ్ చేసేసి రిలాక్సింగ్‌గా కూర్చున్నాడు.

రశ్మి చటుక్కున తల తిప్పి విండోలోంచి బయటకి చూసేస్తోంది.

"ఎక్స్‌క్యూజ్ మీ! మీరు చందన కజిన్ కదూ" రాజాయే రశ్మిని పలకరించాడు.

మెల్లగా తలూపింది.

"మీరు హైదరాబాద్‌లో ఉంటారా?" వాళ్లమ్మ లేదుగా చాలా చక్కగా మాట్లాడేస్తున్నాడు.

అవునన్నట్లు మళ్లీ తలూపింది. ఇంకా గొంతు పెగలటం లేదు.

"మీకు మాటలు రావా?" నవ్వుతూ అడిగాడు.

చిన్నగా నవ్వింది.

"యువర్ గుడ్‌నేమ్ ప్లీజ్?" అడిగాడు రాజా.

"రశ్మి" నెమ్మదిగా చెప్పింది.

"రశ్మి వెరీ స్వీట్ నేమ్. కానీ మీకు నీలూ అన్న నేమ్ ఇంకా బాగా సూటవుతుంది"

రాజా కళ్లల్లో కొంటెతనం తళుక్కుమంది. అతని పెదవులు అల్లరిగా నవ్వాయి.

రశ్మి దొరికిపోయిన దొంగలా ఒక్క నిమిషం బ్లాంక్‌గా చూస్తూ ఉండిపోయింది.

"ఎందుకంత షాక్ అయ్యావు? నువ్వేనని నాకెప్పుడో తెలుసులే" నవ్వుతూ చెప్పాడు. ఇదింకా పెద్ద షాక్. ఒక్క క్షణమయ్యాక "ఐయాం సారీ! ఏదో సరదాగా అలా చేశాను. కానీ మీరెలా తెలుసుకున్నారు?" తలదించుకుని అడిగింది.

"రశ్మీ! నీలూ నువ్వేనని ఆ రోజు మీరు బీచ్‌కెళ్తున్నప్పుడే నాకు డౌట్ వచ్చేసింది" నవ్వాడు రాజా.

"ఎలా?" విస్మయంగా అడిగింది.

"చందన స్కూటీ చప్పుడు, ఆ బీట్ నాకు బాగా అలవాటు. ఆ రోజు నీతో ఫోన్లో మాట్లాడుతుంటే నాకా సౌండ్ క్లియర్‌గా వినిపించింది. తర్వాత మీరు సబ్‌మెరైన్ మ్యూజియం దగ్గరకెళ్లాక తెలిసిపోయింది. ఎందుకంటే వైజాగ్‌కి కొత్తగా వచ్చిన వాళ్లు తప్పకుండా అక్కడికి వెళ్తారు. స్కూటీ మీద వెళ్లింది కొత్తగా వచ్చింది నువ్వే అయి ఉంటావని ఎక్స్‌పెక్ట్ చేసి అందుకే నేనొస్తానన్నాను. దాంతో మీరిద్దరూ కంగారుగా ఇంటికొచ్చేస్తుంటే నువ్వే అని కన్ఫర్మ్ అయిపోయింది. ఆ తర్వాత నిన్ను ఇంకా క్లోజ్‌గా అబ్జర్వ్ చెయ్యడం మొదలుపెట్టాను. నన్ను చూసిన నీ కళ్లలో అల్లరి, దొంగ నవ్వులు. ఇంకా ఇవాళ గేటు దగ్గర నీ దిగులు నాకు చెప్పకనే నీ మనసు చెప్పేశాయి" రాజా రశ్మినే తదేకంగా చూస్తున్నాడు.

"ఏం చెప్పాయి?" రశ్మి ఎందుకో రాజా వైపు చూడలేకపోయింది.

"ఈ అల్లరి పిల్లకి నేను నచ్చానని" కొంటెగా చూస్తూ చెప్పాడు రాజా.

"మరి ఆ నీలూ?" కాస్త కోపంగా అడిగింది.

"ఆ నీలూకి పెళ్లయి మూడేళ్లయింది" ఫక్కున నవ్వాడు.

దొరికిపోయాను అనుకుని రశ్మి సిగ్గుగా నవ్వింది.

"రశ్మీ! నువ్వు ఎస్ అంటే క్వార్టర్ ఎలాట్ చేయించుకుంటాను" ఆమె కళ్లల్లోకి చూస్తూ మెల్లగా చెప్పాడు రాజా.

రశ్మి మొహంలోకి ఏవో కొత్తకాంతులు వచ్చేశాయి. కళ్లు సిగ్గు బరువుతో వాలిపోయాయి.

"ఈ అల్లరిపిల్లకి సిగ్గుపడడం కూడా వచ్చా? గోడలెక్కడమే వచ్చనుకున్నానే" రశ్మి చెయ్యి మృదువుగా పట్టుకున్నాడు.

"నేను ఎస్ అనాలంటే ఒక కండిషన్. నువ్వింక ఆ కూలింగ్ గ్లాసెస్..." అంటూ నవ్వింది. ఆమెలోని అల్లరి పిల్ల బయటకి వచ్చేసింది.

"ఇక వీటి అవసరం నాకు లేదులే. ఇక ఈ రాజా ఇంట్లో కృష్ణుడు. వీధిలో రాముడు ఓకేనా" రాజా కూడా సరదాగా నవ్వుతూ పాకెట్‌లోంచి ఆ గ్లాసెస్ తీసి రశ్మికి ఇచ్చేశాడు.

"నువ్వు ఫాస్టని తెలుసు కానీ మరీ ఇంత సూపర్‌ఫాస్టని ఇప్పుడే తెలిసింది. ఇందుకేనా ఇలా ట్రైనెక్కావు?" రశ్మికి రాజా ఇంకా ఇంకా నచ్చేస్తున్నాడు.

"ఇదేం ఫాస్ట్? ఇంకా చాలా కథ ఉంది కదా. నీ పేరెంట్స్‌ని కలిసి, మా అమ్మ నమ్మేట్లు మన అరేంజ్డ్ మారేజ్‌కి ప్రిపరేషన్స్ చెయ్యాలి. అలాగే నీక్కాస్త ట్రైనింగ్ ఇవ్వాలి. నీకెక్కువ అక్కర్లేదులే ఆల్‌రెడీ ఇవాళ పొద్దున్న నిన్ను శారీలో చూసి అమ్మ బాగానే ఇంప్రెస్ అయినట్టుంది. నాన్న ఎప్పుడో ఓకే. ఆయనకి ఈ అల్లరిపిల్ల బాగా నచ్చేసింది. అన్నీ అయ్యాక అప్పుడు చూపిస్తాను అమ్మాయిగారికి నేనెంత ఫాస్టో" రాజా రశ్మి కందిన బుగ్గలకేసి చూస్తూ చిలిపిగా నవ్వాడు.

ట్రైన్ స్పీడందుకుంది. ఆ యువజంట ప్రేమప్రయాణం పెళ్లి స్టేషన్‌కి పరుగులు తీస్తూ సాగుతోంది.